లక్ష్మీదేవికి నచ్చే ఇళ్లు

లక్ష్మి చంచలమైనది. ఇవాళుంటుంది... రేపు పోతుంది అని అంటుంటారు చాలామంది. దేవతలలో శక్తి స్వరూపిణి అయిన లక్ష్మి ఒకసారి ఇష్టపడివచ్చి ఆ తర్వాత చెప్పాపెట్టకుండా ఎందుకు వెళ్లిపోతుంది? ఆ తల్లి స్థిరంగా మన ఇంట్లోనే నివాసం ఉండాలంటే ఆమెకు ఏం చేయాలి? అనే విషయాలను వివరించి చెబుతుంది ఈ కథాసందర్భం. ఇది బ్రహ్మవైవర్త పురాణం ప్రథమ ఖండం ఇరవైమూడో అధ్యాయంలో ఉన్న విషయం. ఈ విషయాన్నంతా లక్ష్మీపతి అయిన నారాయణుడు స్వయంగా కష్టకాలంలో ఉన్న దేవ తలకు వివరించి చెప్పాడు. దూర్వాస మహాముని ఎంతో ప్రేమతో ఇచ్చిన అపురూపమైన పువ్వును ధన, మదగర్వంతో ఉన్న ఇంద్రుడు సరిగా తీసుకోక అవమానంగా ప్రవర్తించాడు. ఆ పువ్వును తన పక్కనే ఉన్న ఐరావతం మీదకు విసిరేస్తే దాన్ని ఆ ఏనుగు కాలరాచింది. పెద్దలను అలా ధన, మద గర్వంతో ఇంద్రుడు అవమానించగానే అతడి వైభవం, ఐశ్వర్యం అన్నీ నాశనమైపోయాయి.

కరుణించిన నారాయణుడు

చివరకు ఇంద్రుడి ఏలుబడిలో ఉన్న దేవతలు కూడా దూర్వాసుడి శాపానికి గురై సర్వస్వం కోల్పోయారు. వారికి బుద్ధిమాంద్యం కూడా కలిగింది. స్వర్గాన్ని ఆక్రమించారు. దేవతలు వేదాలు మరచిపోవటంతో యజ్ఞాలు, యాగాలన్నీ ఆగిపోయాయి. యజ్ఞయాగాలు జరగనందువల్ల దేవతలకు హవిస్సులు అందక వారు తమ తేజస్సును కోల్పోయారు. అలా కొంతకాలం గడిచాక దేవతల గురువు బృహస్పతి సూచన మేరకు దేవతలు నారాయణుడిని స్తుతించారు. ఆయన ప్రసన్నుడు కాగానే తమ కష్టకాలం నశించే ఉపాయం చెప్పమన్నారు. అప్పుడు విష్ణువు వారికి లక్ష్మీ కవచాన్ని, లక్ష్మీస్తోత్రాన్ని ఉపదేశించాడు. వాటితో దేవతలు ఆ అమ్మను సంకీర్తించి షోడశ ఉపచార సహితంగా పూజచేశారు. అప్పుడా తల్లి ప్రత్యక్షం కాగానే తమ దగ్గరకొచ్చి తమను అనుగ్రహించమని వేడుకొన్నారు దేవతలు. అయితే ఆ తల్లి దేవతలతో వారి దగ్గరకు తాను వెళ్లలేనని తెగేసి చెప్పింది. దానికి కారణం ధన, మద గర్వితుడైన ఇంద్రుడు వయ స్సులోనూ, జ్ఞానంలోనూ వృద్ధుడైన దూర్వాసుడిని అవమానించటమేనని చెప్పింది. అలాంటి పనులు చేసిన వారి ఇళ్లకు, వారితో సంబంధ బాంధవ్యాలు కలిగినవారి ఇళ్లకు తాను వెళ్లనని, అంతకుముందు తాను అలాంటి ఇళ్లలో ఉండి ఉంటే మరుక్షణమే వెళ్లిపోతుంటానని ఆమె చెప్పింది. లక్ష్మీదేవి తన చంచలత్వానికి కారణాలను ఇంకా వివరంగా ఇలా తెలిపింది. గురువులు, వేదపండితులు, భిక్షుకులులాంటి వారిని గౌర వించక తూలనాడేవారి ఇళ్లకు తాను వెళ్లనంది. దేవతలు, తల్లిదండ్రులు, బంధువులు, పితృవర్గం, అతిథులు ఏ ఇంట సరైన పూజలందుకోక కోపించి పోతుంటారో ఆ ఇళ్లలో లక్ష్మి ఉండదు.

అబద్ధాలు చెప్పినా అమ్మకు నచ్చదు

అబద్ధాలు చెప్పటం, వేదాలను నిరాదరించటం, క్రూరస్వభావం కలిగి ఉండటం, చెడునడవడికతో ఉండటం లాంటివి లక్ష్మీమాతకు నచ్చవు. నమ్మి ఎవరైనా ధనాన్ని ఇచ్చినప్పుడు ఆ ధనాన్ని వారికి తగిన సమ

యంలో తిరిగి ఇవ్వనివారు, దాన్ని అపహరించినవారు, దొంగసాక్ష్యాలు చెప్పేవారంటే లక్ష్మికి గిట్టదు. విశ్వాసహీనులు, కృతఘ్నులు, పిసినారివారు, కార్యదీక్షలేనివారు, ప్రతిదానికీ తగాదా పెట్టుకొనేవారు, శ్రీహరి పూజ, శ్రీహరి కల్యాణ గుణాలను కీర్తించనివారంటే ఆ అమ్మకు అసలు ఇష్టం ఉండదు. తల్లిదండ్రులను, అక్కచెల్లెళ్లను, అన్నదమ్ములను, తన కుటుంబసభ్యులను సరిగా పోషించని వారింటికి ఆమె వెళ్లదు. సరిగా ముఖం కడుక్కోనివారు, పరిశుభ్రంగా ఉండని వారంటే తనకసలు ఇష్టం ఉండదని లక్ష్మీదేవి చెప్పి అలాంటి వారి ఇళ్ల నుంచి తాను వేగంగా వెళ్లిపోతుంటానని అంది. అప్పటికి దేవతలు జ్ఞానహీనంతో అలాంటి పరిస్థితులలో ఉన్నారని, వారంతా పరిశుభ్రంగా ఉండి మంచి పనులను చేస్తూ ఉన్నప్పుడు తప్పకుండా వస్తానంది. లక్ష్మీదేవి చెప్పిన ఆ మాటలను విన్నవారు ఆ మరుక్షణం నుంచే తమ పద్ధతి మార్చుకొని లక్ష్మికి ఇష్టమైన తీరులోకి మారగానే ఆ అమ్మ మళ్లీ వాళ్లందరినీ అనుగ్రహించింది. ఈ కథా సందర్భంలో లక్ష్మీదేవి తాను ఎలాంటి వారి ఇళ్లలో ఉంటుందో, ఎలాంటివారి ఇళ్లలో ఉండదో ఆమే స్వయంగా చెప్పింది. ఆ తల్లి కదలకుండా మన ఇళ్లలోనే ఉండాలంటే చెయ్యాల్సిన పనులు అంత కష్టమైనవి, చెయ్యలేనవి, పెద్దవి కానేకావు. మానసిక, శారీరక, పరిసర శుభ్రతలను కలిగి ఉన్న ఇళ్లలో లక్ష్మీదేవి కదలకుండానే స్థిరంగా ఉంటుంది. కనుక అందరూ అలా ఉండటానికి అలవాటుపడాలి.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావ